హిందోళ - రూపకం

నీమహిమో నాలోన - నిండిన వలపు జాడో
యేమిసేతు నన్నెప్పుడు - నెడయకు వయ్యా

యెనసి నీతో నేను - యెంతవడి మాటాడినా
తనియదు నామనసు - తమియెట్టిదో
వినయముతో రెప్పలు - వేయక జూచినాను
నినుపులై మమతలు - నిచ్చకొత్తలు

చలపట్టి నీతోను - సారె సారె బెనగిన
నలయదు నామేను - ఆసయెట్టిదో
కొలువులో నీవద్ద - కూచుండి యెంత నవ్వినా
తలపులో కోరికలు - తరగని ధాన్యాలు
కడగి యందాకా నిన్ను - కౌగలించు కుండినాను
విడువవు చేతులు - వేడుకెట్టిదో
అడరి శ్రీవేంకటేశ - అలమేల్మంగను నేను
తొడరి యేలితివి ర - తులు తీపులు

ఈ సంకీర్తనంలో అన్నమాచార్యులు అలమేల్మంగ అమ్మ వారైనారు. తన మనస్త త్వాన్ని అలమేల్మంగ అమృతపు పలుకులలో కులికించారు. మాట అలమేల్మంగమ్మది. ఆ మాట వెనక తలపు వలపు తేనె తేట అన్నమయ్యది. ఈ సంకీర్తనమే అన్నమాచార్యుల మనస్తత్వం. ఇందులో ధాతుమాతువులు అన్నమాచార్యులూ అలమేల్మంగా.

అన్నమాచార్యులు అంటున్నారు అల్మమేల్మంగ పలుకు తున్నది. ఒకేమాట... స్వామీ; ఇ దేమో తెలియరావడం లేదు. కేవలం నీమహిమయో నీపై నాకు హెచ్చిన మోహమో ఇద మిత్థమని నిర్ణయింపలేని నిస్సహాయ స్థితిలోఉన్నాను. నన్నెప్పుడూ విడువకయ్యా.

నీతో యెంతసమయం నేను సంభాషించినా తనివి తీరదే. తీరని ఈ తనివి ఇది యేమో? ఎంతదాకా అనిమేషదృష్టితో నిన్ను వీక్షించినా నాకు నీపైగల మమతలు నిత్య నూతనంగా అతిశయిస్తున్నవే గాని తగ్గడం లేదు. ఇదేమి మమతో తెలియరాదు. (నన్ను విడవ వద్దు సుమా).

నీతో యెన్ని పర్యాయాలు రతిపట్లు పట్టినా (ఎన్ని సేవలు నీకు చేసినా) నాశరీరం అలపు జెందరు. ఇదియెక్కడి ఆశ?  తీరదేమి? నీచెంత కొలువుదేరి, ఆనందంతో యెంత నవ్వినా, ఆనందపుటందాన్ని ఎంత ఆవిష్కరించినా నా మనసులో కోర్కెలు మాత్రం తీరడం లేదు. ఇదియేమిటి? ఈ తీరని కోరికలు అక్షయ రాశిలోని ధాన్యాలా?

ఎంతదాకా నిన్ను కౌగలించుకొని ఉన్నా తనివితీరని నా చేతులు నిన్ను విడచిపెట్ట లేక పోతున్నాయి. ఇదేమి వేడుక? తనివి తీరదు. మమతలు నిత్యనూతనాలు. అలపు రాదు, ఆశతీరదు. కోరికలు అక్షయాలు. నా మనోవాక్కాయ కర్మలు నిన్ను విడిచి ఇతర మపేక్షించవు. ఇదేమి చోద్యం? శ్రీవేంకటేశ్వరా నేను అలమేల్మంగను (నేను అన్నమాచార్యుడను). ఇంతదాకా నన్ను నిరతిశయ ప్రేమతో లాలించావు. పాలించావు. ముందెన్నడూ నన్ను విడువకు (కృతజ్ఞుడను.)

స్వామి వద్ద అలమేల్మంగగా అన్నమాచార్యులు గునిసిన గారపు గుసగుసలు ఈ సంకీర్తన రసపుపసలు.